క్లుప్తంగా

గవర్నర్ అభినందన



అంజనను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై

కాచిగూడ: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థిని అంజన పిల్లన గ్రోవి (ఫ్లూట్)పై 53 సెకన్లలో జనగణమన (జాతీయ గీతం) ఆలపించి 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్'లో చోటు దక్కించుకుంది. విద్యార్థిని అంజన తల్లి దండ్రులు సాయిమాధురి, ధీరజ్ కుమార్‌తో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కలిసి గవర్నర్ చేతుల మీదుగా రికార్డును తీసుకున్నారు. విద్యతో పాటు కళారంగంలో రాణించాలని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులను అందుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గవర్నర్ అంజనను ఆశీర్వదించారు.

పేదల సొంతింటి కలకు 'గృహలక్ష్మి'



అంబర్‌పేట్: పేదల ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట్‌లో గృహలక్ష్మి పథకం కింద 140 మంది లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి ఈ పథకం కింద డబ్బుల మంజూరయ్యాయని చెప్పారు. మంజూరైన డబ్బులతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టుకోవాలని సూచించారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో చేయూతనిచ్చారన్నారు. కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రూ. 67 లక్షలతో అభివృద్ధి పనులు

చిక్కడపల్లి: గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో రూ.67 లక్షలతో వీడీసీసీ రోడ్డు, ప్యాచ్‌వర్క్ పనులను కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, బీఆర్‌ఎస్ యువనాయకులు ముఠా జైసింహ, జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలాం, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గడ్డమీది శ్రీనివాస్, శ్రీకాంత్, సత్యనారాయణ, బత్తుల కిరణ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, పాల శ్రీనివాస్, మహమూద్, సురేందర్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ తదితరులున్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలి

కాచిగూడ: చేనేత కార్మికులు, సహకార సంఘాల రుణాలను మాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆరోపించారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని రాజ బహదూర్ గౌర్ హాల్‌లో జరిగిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యపరచడం దుర్మార్గమన్నారు. ఆత్మహత్యల పాలైన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, జియో ట్యాగ్ వేయని మగ్గాలకు వెంటనే వేసి ప్రభుత్వ పథకాలను వర్తింప చేయాలన్నారు. 11 రకాల చేనేత ఉత్పత్తులపై రిజర్వేషన్ అమలు జరపాలని, చేనేత మగ్గాలపై తయారైన ఉత్పత్తులను కాపీ కొడుతూ.. ప్రింట్ చేస్తూ పవర్‌లూమ్స్‌పై తయారు చేస్తూ చేనేతకు తీరని నష్టాన్ని కలిగిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్దన్, లక్ష్మీనరసయ్య, రాములు, నర్సయ్య, ధనుంజయ, కస్తూరి బిక్షపతి తదితరులున్నారు.

సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక

చిక్కడపల్లి: తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతికి బతుకమ్మ ప్రతీక అని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో రానున్న బతుకమ్మ పండుగ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా బతుకమ్మ పండుగను నిర్వహించుకునే మహిళలకు పండుగ కానుకగా బతుకమ్మ చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు.

పెరిగిన ఓటర్లు !

- గత ఎన్నికలతో పోలిస్తే 20 వేలు పెరిగిన ఓటర్ల సంఖ్య
- ఓటరు జాబితాలో 20 శాతం కొత్తవారే
- ఆన్‌లైన్ ఓటర్ నమోదుకు అవకాశం

అంబర్‌పేట్: నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈ నెల 4న విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికలకు పోలిస్తే ఈ సారి దాదాపు 20 వేలకు పైగా ఓటర్లు పెరిగారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పోలింగ్‌బూత్‌లో ప్రత్యేక డ్రైవ్ చేసి, అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి నమోదైన ఓటర్లను తుదిజాబితాలో చేర్చారు. ఇప్పటికి ఓటర్లు నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

లాభం ఎవరికీ..

దాదాపు కొత్తగా నమోదైన ఓటర్లంతా యువ ఓటర్లు అని చెప్పడానికి వీలు లేదు. 2018–2023 మధ్యలో రెండు దఫాలుగా కరోనా మహమ్మారి వచ్చింది. దీంతో 2018లో ఉన్న ఓటర్లు కరోనాతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లిపోయారు. వెళ్లిపోయిన వారంతా తిరిగి అంబర్‌పేట్‌కే ఖచ్చితంగా వచ్చారనే సమాచారం లేదు. పాత ఓటర్లు వెళ్లిపోయినా.. కొత్తగా ఓటర్లుగా పెద్ద ఎత్తున నమోదు చేసుకోవడం గమనార్హం. నియోజకవర్గంలో ఉన్న మొత్తం ఓటర్లను 20 శాతం పైగా కొత్త ఓటర్లే చేరినట్లు తెలుస్తోంది.



జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 కార్యాలయం

కొత్త ఓటర్ల సంఖ్య..	
మొత్తం ఓటర్లు	- 2,70,728
పురుషులు	- 1,37,385
స్త్రీలు	- 1,33,332
ఇతరులు	- 11
పోలీంగ్ కేంద్రాల సంఖ్య	- 104
పోలీంగ్ బూత్‌ల సంఖ్య	- 236

కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు

అర్హులైన వారు కొత్తగా ఆన్‌లైన్‌లో మాత్రమే ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చు. ఆదనపు ఓటర్ల జాబితాలో ఓటరుగా వారి పేరు నమోదు చేరుతుంది. తుది జాబితాలో పేరు ఉందో లేదో ఓటర్ యాప్‌లో తెలుసుకోవచ్చు.

– మారుతీ దివాకర్, డీఎంసీ జీహెచ్‌ఎంసీ సర్కిల్–16

'ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే సమ్మె'



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే కొన్ని కార్మిక సంఘాలు ఆశావర్కర్లచే సమ్మె చేయిస్తున్నాయని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ మండిపడ్డారు. ఆశావర్కర్లకు ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనాలు ఇస్తుందని ఆయన లెలిపారు. బాగ్‌లింగంపల్లి బీఆర్‌టీయూ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్త (ఆశ) సంఘాలు (బీఆర్‌టీయూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 వేల పైచిలుకు ఆశావర్కర్లు ఉన్నారని, వీరందరు కేంద్ర ప్రభుత్వం స్కీమ్‌లో భాగమని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన నాటికి వీరికి రూ.1600 నుంచి రూ.3 వేలు మాత్రమే వేతనాలు ఉండేవని సీఎం కేసీఆర్ రూ.9900 గౌరవ వేతనాన్ని పెంచారని వివరించారు. కొన్ని కార్మిక సంఘాలు వారిని రెచ్చగొట్టి రోడ్డుమీదకు తీసుకొచ్చి నిరసనలు చేయించడం బాధాకరమన్నారు. తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ) సంఘం, (బీఆర్‌టీయూ అనుబంధం) సంతోష, ప్రధాన కార్యదర్శి కరుణ, అపర్ణ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బర్కత్‌పుర చమన్ వద్ద తనిఖీలు చేస్తున్న కాచిగూడ పోలీసులు

కాచిగూడ: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు సోమవారం రాత్రి బర్కత్‌పుర చమన్ వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సైలు రవికుమార్, హెచ్.నరేష్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

అంబర్‌పేట్: ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ.. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం అంబర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్ హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టల్‌లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతలు అశోక్‌రెడ్డి, వేమన, శివ, గణేష్, ధన్‌రాజ్ తదితరులున్నారు.

దివ్యాంగుల పెన్షన్‌ను పెంచాలి



మాట్లాడుతున్న నంబురాజన్

ముషీరాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రస్తుతం దివ్యాంగులకు ఇస్తున్న ప్రతినెల పెన్షన్ రూ.4016 నుంచి రూ.10 వేలకు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీలోపు పెన్షన్ చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నంబురాజన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమండ్ చేశారు. సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద దివ్యాంగుల మహాధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నంబురాజన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లను మంజూరు చేసి, ఆసరా పెన్షన్లకు ఆదాయ పరిమితిని విధించే జీవో నెంబర్ 17ను రద్దు చేయాలన్నారు. 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతి, ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకట్, అడివయ్య, నాయకులు ప్రభాకర్, హిమోఫీలియో హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి శ్రీనివాస్, తెలంగాణ దివ్యాంగుల సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మోహన్, ఎన్పీఆర్డీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకటేష్, జె.రాజు, వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు హాజరయ్యారు.

ఆత్మలను కదిలించేదే అసలైన భాష



చిక్కడపల్లి: ఆత్మలను కదిలించేదే అసలైన భాష అన్న మహాకవి నారాయణరెడ్డి కవితకు వాస్తవం ఇచ్చే విధంగా రామానంద తీర్థ స్వామీజీ నామ సంకీర్తన ఆలపించారని బాల భవన్ విశ్రాంత సంచాలకుడు ప్రముఖ కవి డాక్టర్ ఎం.కే.రాము ప్రశంసించారు. త్యాగరాయ గానసభలోని సోమవారం రాత్రి కళాదీక్షితులు కళావేదికపై రామానంద తీర్థస్వామీజీ నామ సంకీర్తన పేరిట 2 గంటలకు పైగా తమ గానామృతంతో శ్రోతలను ఆకట్టుకున్నారు. కన్నన్, సాయిరామ్, జయరాం, సహగానం చేయగా.. వెంకట్రామన్ హార్మోనియం, హరి మృదంగంపై సహకరించారు. భారతి మ్యూజిక్ అకాడమీ 23వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రాము పాల్గొని రామానంద తీర్థను నామ సంకీర్తన అద్వైత ప్రచార భారతి బిరుదుతో సంస్థ తరఫున సత్కరించారు. తిరుమల గ్రూప్స్ అధినేత నంగునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రామానంద గానం నాటి శంకరాభరణం సినిమాలోని శంకరశాస్త్రి సంగీత ప్రతిభను గుర్తు చేసిందన్నారు. సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ, నిర్వాహకుడు చింతలపాటు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీని ఆరోగ్యశ్రీలో చేర్చాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగీ, వైరల్ జ్వరాల కారణంగా ప్రజలు ఆరోగ్యంగానే కాక ఆర్థికంగా కూడా కుంగిపోతున్నారని కాబట్టి ఈ వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చి ఉచితంగా వైద్యసేవలు అందించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు స్వరూప, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రవికృష్ణలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ సంఘాల ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత 20 రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ తీవ్రత అధికంగా ఉందననారు. అయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు లక్ష్మీభాయ్, వరలక్ష్మి, దేవమణి, నాగమ్మ, పుష్ప తదితరులున్నారు.


బడుగుల ఆశాజ్యోతి కాన్షీరాం

ముషీరాబాద్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాన్యవార్ కాన్షీరాం అని బీఎస్పీ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ నరేందర్ అన్నారు. సోమవారం కాన్షీరాం 17వ వర్ధంతి సందర్భంగా భోలక్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలలో పెను మార్పుల కోసం కృషి చేసి, దళితులు, బీసీలకు సముచిత స్థానం దక్కేలా తుదిశ్వాస వరకు పోరాడారని కొనియాడారు.

యువతి అదృశ్యం

అంబర్‌పేట్: మతిస్థిమితం సరిగ్గాలేని ఓ యువతి అదృశ్యమైన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపునగర్‌లో నివసించే ఎం.వెంకటేష్ కుమార్తె రజినీ (32) గత నెల 27న ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆయా ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్‌మ్యాక్స్ కంపెనీలో ఉత్పత్తిని ప్రారంభించాలి



ధర్నాలో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: నగరంలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఉన్న సూపర్‌మ్యాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో సుమారు వేయి మంది కార్మికులు గత 30 ఏళ్లుగా పనిచేస్తున్నారని.. గత రెండేళ్లుగా యాజమాన్యం కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు, పెండింగ్ బకాయిలను చెల్లించకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారికి న్యాయం చేయాలని పలువురు కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో సూపర్ మ్యాక్స్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌రెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు మల్లికార్జున్, బీఆర్‌టీ అధ్యక్షుడు మాజీ మంత్రి పెద్దిరెడ్డిలు హాజరై కార్మికుల ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మూతపడ్డ సూపర్ మ్యాక్స్ కంపెనీని తిరిగి ప్రారంభించి కంపెనీలో వెంటనే ఉత్పత్తులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఓ పెద్ద కంపెనీ మూతపడడం బాధాకరమన్నారు. గత 16 నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులు కనీస అవసరాలు తీర్చుకోలేక అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంపెనీ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు సరైన న్యాయం చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి పెద్దిరెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు జె.మల్లికార్జున్ మాట్లాడుతూ.. సూపర్‌మ్యాక్స్ కంపెనీ కార్మికుల సమస్యలను అనేక దఫాలుగా కార్మికశాఖ జాయింట్ లేబర్ కమిషనర్ చతుర్వేది, లేబర్ కమిషనర్ అహ్మద్ నదీం, కార్మికశాఖ మంత్రి మాల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ కంపెనీ యాజమాన్యం సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడంతో కార్మికులు మరింత అయోమయానికి గురవుతున్నారన్నారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలనే డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారు చేపట్టే ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించి ప్రత్యక్షంగా పాల్గొంటామని హెచ్చరించారు. హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రావు, చంద్రశేఖర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నగర నాయకులు సిరిగిరి శ్యామ్‌కుమార్, కల్వగోపి తదితరులున్నారు.

రూ. 1.57 కోట్లతో అభివృద్ధి పనులు



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: నియోజకవర్గంలో ఒకే రోజు రూ.1.57 కోట్లతో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ గంగపుత్ర కాలనీలో రూ.9 లక్షలతో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్, సాయిరెడ్డి పటేల్‌నగర్‌లో రూ.3.25 లక్షలతో డ్రైనేజీ పైపులైన్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో రూ.7.50 లక్షలతో డ్రైనేజీ పైపులైన్, పక్కీర్‌వాడాలో రూ.5.75 లక్షలతో డ్రైనేజీ, కాశదర్ నగర్‌లో రూ.4 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులు, రేడియెంట్ హైస్కూల్ వీధిలో రూ.3.93 లక్షలతో డ్రైనేజీ పైపులైన్, ముషీరాబాద్‌లో రూ.4 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ప్రతి కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారానికి కేసీఆర్, కేటీఆర్‌లగా పని చేశారని, అందువల్లే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేశామని తెలిపారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ట్రేడ్‌సెల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, శివముదిరాజ్, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, సీనియర్ నాయకులు నేత భాస్కర్, పూసగోరఖ్‌నాథ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఉపాధ్యక్షులు మోయిస్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్ తదితరులున్నారు.

భోలక్‌పూర్‌లో..

భోలక్‌పూర్ డివిజన్‌లోని కృష్ణ కాలనీలో రూ.8.20 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు మెట్రో రైల్వేశాఖ అధికారుల అనుమతి లభించకపోవడం వల్లే నిర్మాణ పనుల జాప్యం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, మీడియా సెల్ ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, సీనియర్ నాయకులు రెబ్బ రామారావు, ఆర్.శ్రీనివాస్, బల్లా ప్రశాంత్ తదితరులున్నారు.

గిరిజనుల హామీలను అమలు చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు గిరిజనుల హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆయా పార్టీలు తమ మ్యానిఫెస్టోలో గిరిజనుల డిమాండ్లను చేర్చాలన్నారు. ఓట్ల కోసం వాగ్దానాలు చేస్తూ.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వాగ్దానాలకు మోసపోకుండా గిరిజన సమాజం చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన తరువాత ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆయా సర్పంచ్‌లు అప్పులపాలై 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామన్న సీఎం కేసీఆర్ కేవలం రూ.4 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్, గిరిజన మేధావుల ఫోరం అధ్యక్షులు ధనుంజయ్‌నాయక్, సేవాలాల్ సేనా అధ్యక్షుడు రాంబాబునాయక్, వివిధ సంఘాల నాయకులు రఘు, రవీంద్రనాయక్, సుమన్, అమర్‌సింగ్, బాలు, దేవీలాల్ తదితరులున్నారు.

వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

నల్లకుంట: ఏ కోర్సు చదివినప్పటికీ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకుంటే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ.. వస్తాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రధానంగా ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులపై ఆసక్తి పెంచుకోవాలని యువతకు సూచించారు. తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ అధ్వర్యంలో సోమవారం న్యూ నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని ఆర్ఎస్‌టీ టెక్నాలజీస్‌లో కొత్త బ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు జ్యోతి ప్రజ్వలన చేసి కొత్త కోర్సులను ప్రారంభించి మాట్లాడారు. యువతలో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. రంజిత్ కౌర్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సిద్ధిరాములు

ముషీరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంటిజెన్సీ, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగ, కార్మికులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంటిజెన్సీ వర్కర్స్ యూనియన్ (బీఎల్‌టీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్. సిద్ధిరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంటిజెన్స్ వర్కర్స్ యూనియన్ (బీఎల్‌టీయూ) ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిద్ధిరాములు మాట్లాడుతూ... ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సబ్బని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శులు లక్కన్ నాయక్, అబ్బర్‌బేగ్, కోశాధికారులు జ్యోతి, ఎస్. నర్సింహులు, కార్యవర్గ సభ్యులు పద్మ, శారద, ఎస్.గిరి, ఎం. రాజు, భారతి, వెంకన్న, ఆంజనేయులు తదితరులున్నారు.